ఎంపిపిగా జల్లా ప్రభావతమ్మ ఏకగ్రీవం

గాలివీడు : మూడవ ఎంపిపి అభ్యర్థి జల్లా ప్రభావతమ్మను ప్రాదేశిక సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడూతూ ప్రజాప్రతినిధులు ఒకరినొకరు సహకరించుకుంటూ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్టపల్లి యదు భూషణరెడ్డి, లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు ఆవుల నాగభూషణ్‌రెడ్డి, వైసిపి మైనర్టీ నాయకులు ఎస్.కె.ఖాదర్‌మోదీ, ఎంపిడిఒ శేఖర్‌నాయక్, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

ఎంపిపిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రభావతమ్మ

'అన్నమయ్య' నిర్మాణ పనులపై నిర్లక్ష్యం తగదు

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

రెండున్నర సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలతో అన్నమయ్య డ్యామ్ తెగిపోతే తిరిగి నిర్మాణ పనులు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం తెగిపోయిన అన్నమయ్య డ్యాంతో పాటు వర్షాభావం వలన ఆస్తి, ప్రాణ నష్టం కోల్పోయిన గ్రామాల్లో సిపిఎం నాయకుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వరదల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం ఇళు కోల్పోయిన వారికి ఇల్లు నిర్మించి రూ.ఐదు లక్షలు ఇస్తామని కేవలం రూ.లక్ష ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ చేత శరవేగంగా ఓట్ల కోసం ఇల్లు నిర్మిస్తున్నారని తెలిపారు. పులపుత్తూరులో కట్టే గృహాల్లో గోడలు, సీలింగ్ కూలుతున్నాయన్నారు. కాంట్రాక్టర్ ఇల్లు కట్టించే క్రమంలో కూలీలకు డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ రాజ్యాంగ నిబంధనలు ఉల్లంఘించి కులాల వారీగా మాల మాదిగ, ఒసిలుగా విభజించి గృహ నిర్మాణాలు చేపట్టడమనేది భాధ్యతా యుత పదవిలో ఉండి కుల వివక్షతను పెంచి పోషించడం కాదా అని ప్రశ్నిం చారు. ఎగువమందపల్లికి రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. సంవత్స రంలో తెగిన డ్యాం నిర్మిస్తామన్న ముఖ్య మంత్రి మూడేళ్లయినా అంగుళం పని కూడా ప్రారంభించకపోవడం నిర్లక్ష్యమేనని తెలిపారు. డ్యాం తెగకుంటే ఈ వేసవిలో రైతులు పంటలు పండించుకునేవారని పేర్కొన్నారు. నేడు ఆ పరిస్థితి లేకపోగా భూగర్భ జలాలు అడుగంటి పోయాయని గ్రామాల బోర్లలో నీరు ఇంకి పోయి నీటి ఎద్దడికి ప్రభుత్వ వైఫల్యం కారణమని డ్యాం నిర్మాణ పనులు చేపట్టే వరకు, వరదభాధితులుకు పూర్తి న్యాయం జరిగేలా ప్రజల్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, సి.రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహులు పాల్గొన్నారు.

పేరుకే ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయం

వారంలో ఒక్కరోజు మాత్రమే అధికారుల హాజరు

అటు తర్వాత పలకరించే దిక్కు కరువు

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా కేంద్రంలో ఎస్‌సి సమస్యల పరిష్కారం కోసం, వారికి రుణాలు మంజూరు చేసేందుకు అన్నమయ్య జిల్లా రాయచోటిలో కలెక్టరేట్ పక్కనే మైనార్టీ బాలికల హాస్టల్ లోపల పలు జిల్లా కార్యాలయంతో పాటు ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయాన్ని ఏడాది కిందట మూడు గదులలలో అధికారులు ఏర్పాటు చేశారు. ఎప్పుడు ఈ కార్యాలయం మూతబడి ఉండడం గమనార్హం. తమ సమస్యలను పరిష్కరించేకునేందుకు జిల్లా నలుమూలల నుంచి ఎందరో ఎస్‌సిలు ఈ కార్యాలయానికి వచ్చినా పలకరించే దిక్కు కరువయ్యారు. ఎప్పుడు చూసినా మూసేయడంతో ఈసురోమంటూ వెనుదిరుగుతున్నారు. కార్యాలయం సిబ్బంది అక్కడ ఉండకుండా ఉంటున్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఈ కార్యాలయం ఉన్నప్పటికీ ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఎలాంటి నిధులు సామాన్యులకు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే కార్యాలయం ఏర్పాటు చేసినా అక్కడ కేవలం వారంలో సోమవారం రోజు గ్రీవెన్స్ సెల్‌కు (స్పందన)మాత్రం తూతూమంత్రంగా అధికారి అక్కడికి వచ్చి కార్యాలయం తెరిచి కాసేపు కాలయాపన చేసి సాయంత్రం నాలుగు గంటలకి మూత వేసి వెళ్తున్నారు. ఎవరైనా సమస్యలు ఉన్నట్లు అక్కడికి వస్తే అందుకు సరైనటువంటి వారికి పరిష్కారం జరగకపోవడం గమనార్హం .ముఖ్యంగా రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లి, వాయల్పాడు, పీలేరు నియోజకవర్గాల నుంచి ఎస్‌సిలు ప్రభుత్వం పత్రికల్లో టీవీలలో వచ్చి ప్రకటనలు చూసి తమకు ప్రభుత్వం ఎన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాయా అనుకుని ఎంతో ఆశతో వస్తే తీరా కార్యాలయంలో సమాచారం ఇచ్చే వారు లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాన్ని నిత్యం తెరిచి, ఎస్‌సిలకు ప్రభుత్వం ద్వారా పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులకు ఎంతైనా ఉంది. కానీ కలెక్టర్ కార్యాలయానికి దగ్గరలో ఉన్న అధికారులు మాత్రం కార్యాలయం వైపు చూడకుండా పోవడం ఎంతో బాధాకరమని పలువురు వాపోతున్నారు. కనీసం ఫోన్ చేస్తే స్పందించని పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి నిత్యం కార్యాలయం తెరచి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

తెరుచుకోని ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయం

కార్పొరేషన్ కార్యాలయం తెరవాలి

జిల్లా కేంద్రంలో పలు కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉన్నారు. కేవలం ఎస్‌సి కార్పొరేషన్ కార్యాలయం మాత్రమే ఎప్పుడు చూసినా మూత వేసి ఉంది. పలుమార్లు కార్యాలయానికి సమస్యలపైన వస్తే అధికారులు అందుబాటులో ఉండడం లేదు. కనీసం సలహాలు సూచనలు ఇవ్వడానికి కూడా అందుబాటులో లేరు. అధికారులకు ఫోన్లు చేసిన తీయడం లేదు .ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రోజూ ఎస్సీ కార్యాలయం తెరిచేందుకు చర్యలు తీసుకోవాలి .

-ఆర్. సతీష్ కుమార్, చీమలచెరువుపల్లె, గాలివీడు.

సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు

వారంలో రెండు రోజులు అందుబాటులో ఉంటున్నాం. సోమవారంతో పాటు మరో రెండు రోజులు ఎస్‌సి కార్యాలయంలో అందుబాటులో ఉన్నాం. తాను కడప ఎస్‌సి కార్యాలయంలో రెగ్యులర్‌గా పనిచేస్తున్నాను. రాయచోటిలో ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. రికార్డులు ఉమ్మడి జిల్లాలోని ఉండడంతో తమ సిబ్బంది కూడా కడప కార్యాలయంలోనే పనిచేస్తున్నారు. రాయచోటిలో రోజూ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

-హెచ్.వెంకటసుబ్బయ్య, ఇడి, ఎస్‌సి కార్పొరేషన్, అన్నమయ్య.

పులివెందుల ప్రజలూ జగన్ బాధితులే

పులివెందులకు ఏం చేశారో చెప్పాలి

పాలకొండను మింగేసిన వైసిపి అనకొండలు

పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-సిద్ధవటం

90 వేల మెజార్టీతో గెలిపించిన పులివెందుల నియోజకవర్గానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏం చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ప్రశ్నించారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 120 రోజుకు చేరుకుంది. గురువారం కడప శివారులోని ఓ ప్రయివేటు కల్యాణ మండపం విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం సిద్దవటం మండలంలోని టక్కోలిలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి మాచుపల్లె, చంటిగారిపల్లె విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో న్యాయవాదులు, రైతులు, స్థానికులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ జయంతి, వర్ధంతికి రావడం తప్ప పులివెందులకు జగన్ చేసింది ఏమీలేదన్నారు. ఒక్క పరిశ్రమ తీసుకొచ్చాడా? రోడ్లు వేసాడా? కోట్ల రూపాయలు మంజూరు చేశానంటున్నాడు. ఒక్క రూపాయి విడుదల చేశాడా? అని ప్రశ్నించారు. జగన్ పాలనలో విపరీతంగా పన్నులు పెంచి ప్రజల్ని పీడిస్తున్నాడని విమర్శించారు. పులివెందుల ప్రజలు కూడా జగన్ బాధితులేనని తెలిపారు. పులివెందులలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు ఏమి జరగడం లేదని చెప్పారు. నాడు-నేడు పేరుతో హడావిడి తప్ప పులివెందుల స్కూళ్లలో కనీసం మౌలిక వసతులు లేవన్నారు. రూ.వందల కోట్లతో రోడ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశాడన్నారు. జగన్. ఒక్క రోడ్డు కూడా పూర్తి చేయలేదన్నారు. పంచాయతీ రాజ్ శాఖ అధ్వర్యంలో వేయాల్సిన రోడ్లు పూర్తి చేయలేదని చెప్పారు. కనీసం అదనంగా ఒక్క ఎకరాకు సాగునీరు జగన్ అందించలేదని పేర్కొన్నారు. పులివెందులలో టిడిపి గెలవకపోయినా ఎప్పుడూ చిన్న చూపు చూడలేదన్నారు. అన్ని నియోజకవర్గాల లాగే పులివెందులను అభివద్ధి చేశామని తెలిపారు. సాగు నీరు, సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు అమలు చేశామన్నారు. రాజకీయ అవకాశాలు కూడా ఎక్కువ కల్పించామని, ఎన్నో పదవులు ఇచ్చామని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడినప్పుడే ప్రజలు మనల్ని ఆశీర్వదిస్తారని తెలిపారు. కేసులకు భయపడి ఇంట్లో పడుకుంటాం అంటే ప్రజలు హర్షించరన్నారు. పోరాడిన వారికే ప్రజల మద్దతు ఉంటుందన్నారు. మిషన్ రాయలసీమలో భాగంగా పులివెందులకు కూడా పరిశ్రమలు తీసుకొస్తామన్నారు. జగన్ మైక్రో ఇరిగేషన్ అంటూ హడావిడి చేశారని, ఒక్క అడుగు ముందుకు వేయలేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్ ప్రాజెక్టులు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జగన్ ఒక ఉగ్రవాదని, అన్ని వ్యవస్థల్ని నాశనం చేసాడన్నారు. ప్రజా వేదిక కూల్చి పరిపాలన ప్రారంభించాడని తెలిపారు. జగన్ పాలనలో న్యాయవాదులు కూడా బాధితులేనని పేర్కొన్నారు. న్యాయవాదులపై దాడులు చేయించాడన్నారు. న్యాయవాదులకు అనేక హామీలు ఇచ్చిన జగన్ ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని పేర్కొన్నారు. రాజకీయ లబ్ది కోసమే జగన్ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాడన్నారు. మూడు రాజధానుల పేరుతో మోసం తప్ప ఒక్క ఇటుక పెట్టలేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే కర్నూలులో హై కోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. నేషనల్ లా కాలేజ్ కర్నూలులో ఏర్పాటు చేయాలని టిడిపి అనుకుంటే దానిని జగన్ వేరే ప్రాంతానికి తరలించాడన్నారు. కోర్టుల్లో ఎంత దుర్భరమైన పరిస్థితులు ఉన్నాయో నేను స్వయంగా చూశానని,. కనీసం కూర్చోడానికి కుర్చీలు, బాత్ రూంలు కూడా లేవని పేర్కొన్నారు. వైసిపి అక్రమార్కులు కంటిపడితే చాలు కొండలు, గుట్టలు మాయమై పోతున్నాయన్నారు. పాదయాత్రలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి కడప జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, ఎమ్మెల్సీ రామ్‌గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి, నాయకులు అమీర్‌బాబు, బత్యాల చెంగల్రాయుడు, గంటానరహరి పాల్గొన్నారు.



పులివెందుల నేతల సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేష్

వేగవంతంగా పునరావాస చర్యలు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి- రాయచోటి

మంగంపేట నిర్వాసతుల కోసం పునరావసం చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో మంగంపేట ఖనిజాభివృద్ధి సంస్థకు సంబంధించిన పెండింగ్ భూ సేకరణ, రైతులకు పరిహార పంపిణీ, పునరావాస చర్యలు, తదితర వాటిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. మంగంపేట ఖనిజ అభివృద్ధి కోసం ఎన్ని ఎకరాలు భూసేకరణ చేశారు. ఎంతవరకూ పరిహారం చెల్లించారని, ఇంకా ఎంతమందికి ఇవ్వాలని అడిగి తెలుసుకున్నారు. పరిహారం పంపిణీ చేసిన భూములను వెంటనే ఎపిఎం ఐడిసికి అప్పగించాలన్నారు. ఆర్అండ్ఆర్ లేవుట్ సంబంధించి భూమి చదును తోపాటు మ్యాపింగ్, ఫ్లాట్ కేటాయింపు ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. ఆ లేవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు చర్యలు తీసుకొని పనులు ప్రారంభించాలన్నారు. ఒక ఎకరా సబ్ స్టేషన్‌కు స్థలం కేటాయించాలని ఓబులవారిపల్లి తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆర్అండ్ఆర్ 36 ఎకరాలలో ఎన్ని ఎకరాలు కోర్టులో ఉందనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. 16 ఎకరాలకు క్లియర్‌గా ఉంది కనుక తక్షణమే ప్రపోజల్ పంపించాలని ఆదేశించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాజంపేట ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ భాస్కర్, ఆర్అండ్‌బి ఎస్ఇ సహదేవరెడ్డి, ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ, సిపిఒ సుదర్శన రెడ్డి, భూ సేకరణ విభాగం సూపర్డెంట్ మహేశ్వర్ రెడ్డి, ఓబులవారిపల్లి తహశీల్దార్ పీర్ మున్నీ, అధికారులు పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్‌కె పంక్షన్‌హాల్‌లో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తమ వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర మూడు కేటగిరీల్లో ప్రభుత్వం వరుసగా మూడవ ఏడాది అవార్డులుతో సత్కరిస్తోందన్నారు. వివక్ష, అవినీతికి తావులేకుండా వాలంటీర్లు పనిచేయాలని సూచించారు. గ్రామ, వార్డు వాలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలిచి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందివ్వాలన్నారు. వైస్ ఎంపిపి మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధరెడ్డి, ఎస్ కె ఖాదర్ మోహిద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఆవుల నాగభూషన్ రెడ్డి, సర్పంచ్ ఉమాపతి రెడ్డి, సర్పంచ్ కేశవ రెడ్డి కో - ఆప్షన్ సభ్యులు అరవీడు బాష, మాజీ వైస్ ఎంపిపి రమేష్ రెడ్డి సర్పంచ్, వాలంటీర్లు పాల్గన్నారు.

శ్మశానానికి రూ.5 లక్షలతో రోడ్డు

ప్రజాశక్తి- పుల్లంపేట

మండలం పరిధిలోని రెడ్డిపల్లిపేట గ్రామ శ్మశాన వాటికకు ఎట్టకేలకు ఎంపిపి ముద్ద బాబుల్‌రెడ్డి తన ఎంపిపి ఫండ్‌లో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డుకు కేటాయించారు. ఎంపిపి ఆదేశాల మేరకు స్థానిక వైసిపి నాయకుడు రొంపిచర్ల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గురువారం సిమెంట్ రోడ్డుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని శ్మశాన వాటికకు ఎందరో నాయకులు ఉన్న పట్టించుకోలేదని మండల ఎంపిపిని అడిగిన వెంటనే తన నిధులలో తక్షణమే శ్మశాన వాటికకు సిమెంటు రోడ్డు ప్రారంభించాలని ఆదేశించగా సిమెంట్ రోడ్డును ప్రారంభించామని పేర్కొన్నారు. శ్మశాన వాటికకు సిమెంటు రోడ్డును వేయడం గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరికి అవసరం ఉందన్నారు. గ్రామంలోని ప్రజల శ్రేయస్సు కోసం శక్తి వంచన లేకుండా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలియజేశారు. కార్యక్రమంలో రొంపిచర్ల నాగభూషణం పాల్గొన్నారు.

పిల్లలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వీరబల్లి

. అతిసార వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్ బాబు సూచించారు. అతిసార వ్యాధి వారోత్సవాలలో భాగంగా గురువారం గడికోట పంచాయతీ ఎస్‌సి కాలనీలో వైద్య సిబ్బందితో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలకు అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదముందని పేర్కొన్నారు. అతిసార వ్యాధిని నివారించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15 రోజులు ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న ఇళ్లను సందర్శించి వివరాలను సేకరించడంతోపాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో డిపిఎంఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌ల 3వ బ్యాచ్ హాండ్స్ ఆన్ ట్రెనింగ్ ప్రోగ్రాంను జిల్లా డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్స, పాము కాటు, టిబి వ్యాధుల గురించి, పేషంట్‌లకు ఫ్లూయిడ్స్ ఏ విధంగా ఇవ్వాలి, కుట్లు, పేషంట్‌లను అత్యవసర సమయంలో ఏ విధంగా రక్షించాలి, పిసిఆర్ గురించి, నెలవారీ టార్గెట్‌లు ప్రతి నెల అందుకోవాలని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లకు తగు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డిపిఎంఒలు వేణు గోపాల్, శ్రీనివాసులు, ట్రైనర్‌లు, జిల్లా ప్రోగ్రాం మోనిటరింగ్ అధికారి అమర్‌నాథ్, టిబి సూపర్ వైజర్ ప్రభాకర్, రెడ్డెప్ప మరియు వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మిడ్ లెవెల్ హెల్త్ వర్కర్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్

రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-సుండుపల్లి

తమ గ్రామంలో సిసి రోడ్డు వేయాలని గ్రామస్తులు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి విన్నవించారు. గురువారం బండి చిన్న గంగయ్య పెద్దకర్మకు హాజరైన ఎమ్మెల్యేను కలిసి అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో సిసి రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. తమ గ్రామంలో సుమారు 60 కుటుంబాలు నివాసముంటున్నాయని ప్రభుత్వ పథకాలు ఒక్కటీ అమలు కావడం లేదని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామానికి అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

పథకాల రద్దు దారుణం : మాల మహానాడు

ప్రజాశక్తి - సుండుపల్లి

ఎస్‌సి, ఎస్‌టిలకు వర్తించే పథకాలు ప్రభుత్వం రద్దు చేయడం దారుణమని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బండి ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సిలకు అనేక పథకాలను గత ప్రభుత్వాలు అమలు చేశాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఉన్న పథకాలను రద్దు చేయడం సమంజసం కాదని తెలిపారు. పైగా ఎస్‌సి బాలికలపై అత్యాచారాలు, దాడులు అధికమయ్యాయని వాపోయారు. భూమి లేని పేదలకు రెండు ఎకరాలు ప్రభుత్వం ఇస్తే వారు వ్యవసాయం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేవారని తెలిపారు. ఇలాంటి పథకాలు ప్రస్తుతం కన్పించడం లేదని వాపోయారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్‌సిలకు పథకాలను కొనసాగించాలని కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - చిన్నమండెం

మండలంలోని పడమటికోన గ్రామం బోరెడ్డిగారిపల్లెలో నూతనంగా నిర్మించిన పాలేటమ్మ గుడి విగ్రహ ప్రతిష్టాపన గురువారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాయచోటి నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి మండలిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనలను పెంపొందించుకుని ప్రశాంత జీవితానికి అలవాటు పడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపిడిఒగా రఘురాం బాధ్యతల స్వీకరణ

పుల్లంపేట : ఎంపిడిఒగా రఘురాం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో వల్లూరు నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వాటిని నేను వారానికి ఒకసారి పర్యవేక్షణ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఒ ఖాన్, ఇఒపిఆర్‌డి ప్రకాశం, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుకున్న చోటే ఉద్యోగం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

చదువుకున్న చోటే ఉద్యోగం చేసే అవకాశం అరుదుగా కొందరికే దక్కుతుంది. ఈ క్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కన్నెమడుగులో ప్రధానోపాధ్యాయులుగా సిఆర్.నాగసుబ్బారాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను చదువుకున్న పాఠశాలలోనే ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి పిల్లల విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోసువారిపల్లి నుండి బదిలీపై కన్నెమడుగు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించానని పేర్కొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి : గిరీష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను పరిష్కరించాలని, అందుకు ఆయా కేసులకు సంబంధించిన వివరాలతో కౌంటర్లను వేయాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కోర్టు కేసులు, ఓటరు జాబితా, తదితర అంశాలపై సంబంధిత ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కోర్టులో కానీ, హైకోర్టులో కానీ పెండింగులో ఉన్న కేసులపై ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారు అనే విషయమై అధికారుల నుంచి కలెక్టర్ వివరాలు సేకరించారు. కోర్టు కేసులను సీరియస్‌గా తీసుకొని ఎప్పటికప్పుడూ పరిష్కరించుకోవాలన్నారు. కోర్టు కేసుల విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శించరాదన్నారు. జిల్లాలో రెవెన్యూ డివిజనల్ అధికారులు తమ పరిధిలో ఉన్న కోర్టు కేసులకు సంబంధించి కౌంటరు అఫిడవిట్, పేరా వైజ్ రిమార్కులు సకాలంలో కోర్టుకు సమర్పించాలన్నారు. కోర్టులో కేసు ఫైలు అయిన దగ్గర నుండి పేరా వైజ్ రిమార్కులు పంపుట వరకు దశల వారీగా ప్రతి కేసు గురించి వివరాలు పంపాలన్నారు. కడప-రేణిగుంట జాతీయ రహదారికి భూసేకరణ వేగవంతం చేయాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. కడప -రేణిగుంట జాతీయ రహదారి భూసేకరణ సంబంధించి ఫారం -సి ఎంత పెండింగ్ ఉంది వంటి వివరాలను అడిగి తెలుసుకుని ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. పరిహారం పంపిణీ 80 శాతం పూర్తి కావాలని ఆదేశించారు. రాజంపేట 80 ఫైల్స్, ఓబులవారిపల్లి 25, పుల్లంపేట 25 ఫైల్స్ శనివారంలోగా పంపాన్నారు. పక్కాగా ఓటర్ జాబితాను వెరిఫై చేయాలన్నారు. ఇప్పటికే స్పెషల్ సమ్మరీ రివిజన్ షెడ్యూల్ విడుదల చేశారని, ఆ దిశగా వారంలో ఒక గంట ఎలక్షన్ పనుల మీద కేటాయించాలని సూచించారు. ఎలక్ట్రోల్ వెరిఫై పక్కాగా చేయాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒలు రంగస్వామి, మురళి, భాస్కర్, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, భూ సేకరణ విభాగం సూపరింటెండెంట్‌లు మహేశ్వర్ రెడ్డి, నాగభూషణం, తహశీల్దార్లు పాల్గొన్నారు.

చలివేంద్రం వద్ద అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు

ప్రజా సేవే హెల్పింగ్ హ్యాండ్స్ లక్ష్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రజాసేవే హెల్పింగ్ హ్యాండ్స్ లక్ష్యమని అన్నమాచార్య ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ విభాగం సహ అధ్యాపకులు డాక్టర్ జె.శ్రీరంగ నాయకులు, దొనిపర్తి సాయి కృష్ణకాంత్, కె.విజయ భాస్కర్, బయ్యారెడ్డి, అనిల్ కుమార్, హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ వ్యవస్థా పకులు పి.వెంకట రమణ తెలియజేశారు. 71 రోజులుగా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో అటవీ శాఖ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న మంచి నీటి చలివేంద్రాన్ని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధులు సందర్శించి బాటసారులకు చల్లని నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధులు రాధాకృష్ణారెడ్డి, రామచంద్రయ్య, రంగ స్వామి, కొత్త నరసింహులు, సుబ్బారావు పాల్గొన్నారు.

నేటి నుంచి మారెమ్మ పొంగళ్లు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీ మారెమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం నుండి 12వ తేదీ వరకు ఘనంగా అమ్మవారి పొంగళ్ల మహోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఆలయంలో మహా గణపతి పూజ కార్యక్రమాలతో ప్రారంభించి ధ్వజారోహణ కార్యక్రమం, మహా గణపతి హోమం, మారెమ్మ తల్లి మూల మంత్ర హోమాలు నిర్వహిస్తామన్నారు. శ్రీ మారెమ్మ తల్లి ఆలయ సమీపంలోని శ్రీ గంగమ్మ తల్లికి 101 టెంకాయలతో పూజా కార్యక్రమాలు కోమటిగుంట సుబ్బరామయ్య సతీమణి లక్ష్మీదేవి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. శనివారం ఆలయంలో ప్రత్యేక హోమాలతోపాటు విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం 12 గంటలకు భోజన సదుపాయాన్ని కల్పించనున్నట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు. ఆదివారం వివిధ గ్రామాల నుండి విచ్చేసిన భక్తులు అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. సోమవారం అమ్మవారికి ప్రత్యేకంగా పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని కోరారు.

బదిలీపై వెళుతున్న కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

కానిస్టేబుల్ నరసింహులు సేవలు అమోఘం : ఎస్ఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విధినిర్వహణలో కానిస్టేబుల్ నరసింహులు సేవలు అమోఘమని ఎస్ఐ రామ్మోహన్ అన్నారు. బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ నరసింహులుకు ఎస్ఐ ఆధ్వర్యంలో ఘనసన్మానించారు. నరసింహులు బదిలీపై మలకలచెరువు పోలీస్ స్టేషనుకు వెళ్తున్నారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నరసింహులు ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించారని, ఆయన సహకారం మరువ లేనిదన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ బొజ్జ నాయక్,హెడ్ కానిస్టేబుల్ నాగరాజు గౌడ్, రవీంద్ర నాయక్, కానిస్టేబుల్ శేఖర, కావ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

వాల్మీకిపురం సిఐగా సురేష్ కుమార్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

బాధ్యతలు స్వీకరిస్తున్న సురేష్‌కుమార్

వాల్మీకిపురం సిఐగా సురేష్ కుమార్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో రాత్రి గస్తీని ముమ్మరం చేసి, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్రవాహన దారు లు తప్పనిసరిగా హెల్మెట్ ధరిం చాలని, లైసెన్సు, ఇన్సూరెన్స్, వాహన పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ఎవ్వరైనా అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి, త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం ఎస్ఐ, సిబ్బందితో సమావేశం నిర్వహించి, పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది, పాల్గొన్నారు.

పారదర్శకంగా భూ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

భూమి లేని నిరుపేదలకు లబ్ధి చేకూర్చాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన అసైన్‌మెంట్ భూ పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని రాజంపేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పూలభాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలను అసైన్‌మెంట్ కమిటీ ఇదే భాగస్వామ్యులను చేసి నిరుపేదలకు భూములు పంపిణీ చేయాల్సి ఉండాలన్నారు. అందుకు భిన్నంగా నియోజకవర్గంలోని వైసిపి కార్యకర్తల చిట్టానే అసైన్‌మెంట్ కమిటీ ఎంపిక చేసినట్లు ఉందని ఆరోపించారు. అర్హులైన పేదవారికి భూ పంపిణీ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శెట్టిపల్లి సన్నీ, ముస్లిం మైనారిటీ నాయకులు చాంద్ బాషా, శివ పాల్గొన్నారు.

వారాహి యాత్ర కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం వారాహి యాత్ర కరపత్రాలను జనసేన నాయకులు అతికారి దినేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అసమర్ధ ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను, భూ కబ్జాలను, ఇసుక మాఫియాను, అవినీతి పాలనను ఎండగడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ వారాహి యాత్రను ఈ నెల 14వ తేదీ అన్నవరం నుంచి యాత్రను చేపట్టబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో సమస్యలను తెలుసుకోవడానికి జనవాని కార్యక్రమం, ప్రతి నియోజకవర్గంలో ఉన్న నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జనసేన వీర మహిళలు రెడ్డిరాణి, రూప, జనసేన నాయకులు కత్తి సుబ్బరాయుడు, పోలిశెట్టి శ్రీనివాసులు, గుగ్గిళ్ళ నాగార్జున, గుగ్గిళ్ళ వెంకటేష్, రవి పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- జిల్లా చైర్‌పర్సన్ మధుబాల

మదనపల్లె: మధుబాలను సన్మానిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నట్లు జిల్లా చైర్‌పర్సన్ మధుబాల పేర్కొన్నారు. గురువారం ఆమె జిల్లాలోని పలు గ్రంథాలయాలను సందర్శించారు. పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని సందర్శించి ఇక్కడ జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 49 గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరాలకు విశేష స్పందన లభించిందన్నారు. మానసిక వికాసం, మేధోసంపత్తి పెరుగుతుందన్నారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్.వసంత కుమారి, బిటి కళాశాల కరస్పాండెంట్ ఎన్.మునిరత్నమయ్య, కౌన్సిలర్ సుధాకర్, విశ్రాంత ఇంగ్లీష్ ఉపాధ్యాయులు రెడ్డెప్ప పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పుస్తకపఠం అలవర్చుకోవడం వలన సమాజంలో జరుగుతున్న వాటిని తెలుసుకొని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని మధుబాల అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్‌లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, గ్రంథాలయ అధికారి రమాపతి, ఉపాధ్యాయురాలు యామిని, సచివాలయ సిబ్బంది రెడ్డిసుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు. **కురబలకోట:** గ్రంథాలయాలలో వేసవి సెలవుల్లో విద్యార్థులకు నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఉత్సహంగా పాల్గొని విజయవంతమైనట్లు మధుబాల అన్నారు. వేసవి శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్, జడ్పిటిసి జ్యోతి బైసాని చంద్రరెడ్డి, ఎంపిపి దస్తగిరి, ఎంపిడిఒ దిలీప్ కుమార్, సర్పంచ్ సుజాతమ్మ పాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు ముగిసినట్లు గ్రంధాల శాఖ అధికారి అమరనాథ తెలిపారు. ఆటల, వ్యాసరచన, క్విజ్, పుస్తక పఠనం తదితర అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రసంసాపత్రాలు అందజేశారు.

కురబలకోట : ప్రసంసా పత్రాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలో పేదల ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాష అన్నారు. గురువారం మండల పరిధి బండ్లపై గ్రామంలోని దుర్గంవారిపల్లి, గుట్టపల్లి హరిజనవాడ, బండ్లపై హరిజనవాడ, బండ్లపై, జాంద్రబైలు, భూమలగడ్డలో ఎంపిపి నరసింహులు, సర్పంచు వెంకటరత్న, స్థానిక నాయకులు చంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆ ఇంటిలోని లబ్ధిదారులకు అందిన మొత్తాన్ని చదివి వినిపించి, వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజలకు ఉన్న సమస్యలను స్థానికంగా అడిగి తెలుసుకుని, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. పేద కుటుంబంలోని విద్యార్థులు నాణ్యమైన, ఉన్నతమైన విద్యను అభ్యసించడానికి ప్రభుత్వ పాఠశాలలను సమూలంగా మార్చిన ఘనత మన ముఖ్యమంత్రిదన్నారు. గ్రామాలలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో గ్రామ సచివాలయ వ్యవస్థను, వాలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చారన్నారు. దుర్గంవారిపల్లిలో అంగనవాడీ కేంద్ర భవనం, దేవాలయ నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరినట్లు తెలిపారు. అక్కడక్కడ త్రాగునీరు, వీధిలైట్లు, మురుగునీటి కాలువలు, సిసి రోడ్డు నిర్మాణ పనులు వంటి చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధించిన అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలకు మంచి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్న కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచులు వెంకటరత్న, సుబ్రమణ్యం, మహదేవరెడ్డి, చంద్రాయుడు, ఉషారాణి, వైసిపి నాయకులు చంద్రమోహన్, నాగార్జున, నాగిరెడ్డి, లక్ష్మీ రెడ్డి, కదిరప్ప, తహశీల్దార్ సిఆర్ మంజుల, ఎంపిడిఒ లీలా మాధవి, ఎస్ఐ రామకృష్ణ, ప్రభుత్వ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ

ప్రజాశక్తి తంబళ్లపల్లి

మండలంలో ఖరీఫ్ సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వ సబ్సిడీ వేరుశెనక్కాయలు పంపిణీ చేసినట్లు ఎఒ రమణ కుమార్ తెలిపారు. మండలంలోని 12 ఆర్‌బికెల ద్వారా 3,500 క్వింటాల విత్తన కాయలు రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. 5,500 క్వింటాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. రైతులకు అవసరమైనన్ని విత్తన కాయలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గురువారం రైతు భరోసా కేంద్రంలో ఎంపిటిసి మహేష్, రైతులకు విత్తన కాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకుల రవి శంకర్ రెడ్డి, రామ శంకర్ రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రత్నమాలిక పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి-కలికిరి

జగనన్న కాలినందుకు పూర్తి చేయాలని ఎంపిడిఒ గంగయ్య అధికారులను ఆదేశించారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయలో ఆయన ఆధ్వర్యంలో మండలంలోని, హౌసింగ్ ఇన్‌ఛార్జి వెంకటేష్ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీలపై తీసుకున్నటువంటి పట్టాలను అర్హులు ఎవరైతే ఉన్నారో వారు కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు రోజులు లోపల పనులు ప్రారంభించక పోతే పట్టాలు రద్దుపరిచి తీసుకున్న బిల్లులను ఆర్ఆర్ ఆక్ట్ కింద రికవరీ చేస్తారని, పట్టాలు రద్దు పరచడంతో పాటు బిల్లులు కూడా రికవరీ చేస్తామని నోటీసులు త్వరితగతన పంపిస్తామని అధికారులకు తెలియజేశారు. గ్రామ స్థాయిలో ఉన్నటువంటి అధికారులు ఎవరైతే ఇళ్ల పట్టాలు తీసుకొని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్హులందరికీ నోటీసులు అందించి వారిని ఆక్టివ్ చేసి పనులు ప్రారంభించడం లేక రద్దు పరచడమా వీటిని కచ్చితంగా ఆచరించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను కేంద్ర జలశక్తి అభియాన్ బృంద సభ్యులు గురువారం తనిఖీ చేశారు. మండలంలోని కోటావూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద హార్సిలీ హిల్స్ క్రాస్ నుండి కొండపై వరకు రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటిన పనుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు.మొక్కలు నాటిన విధానం బాగుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు.ప్రతి మండలంలో ఉపాధి హామీ పథకం లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.ఉపాధి హామీ కూలీలకు సకాలంలో కూలీలు చెల్లించాలని సూచించారు.అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కోసం అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తోందన్నారు.కేంద్ర బృందం వెంట డ్వామా పీడీ మద్దులేటి, ఎపిడి నందకుమార్ రెడ్డి, ఎపిఒ మంజుల, ఎంపిడిఒ శంకరయ్య, ఉపాధి సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న జలశక్తి అభియాన్ బృందం సభ్యులు

'మిట్స్'లో ఘనంగా ప్రపంచ సముద్ర దినోత్సవం

ప్రజాశక్తి-కురబలకోట

మిట్స్‌లో ఎన్‌సిసి విభాగం వారు ప్రపంచ మహాసముద్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కళాశాల విద్యార్థులు, క్యాడెట్స్ సముద్రం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంగళ్లులోని మల్లేశ్వరం చెరువులో ఉన్న చెత్తను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ప్రతి సంవత్సరం జూన్ 8న ప్రపంచ మహా సముద్రాల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. ఇలాంటి చెత్తలో చాలా భాగం సముద్రాల్లో కలుస్తోందని, అక్కడ పారేస్తే, అడిగేవాళ్లు ఉండరు కదా అని చాలా దేశాలు తమ చెత్తను నౌకల్లో తరలించి సముద్రాల్లో పడేస్తున్నాయని పేర్కొన్నారు. ఇలా రోజూ వేల టన్నుల చెత్త సముద్రాల్లో కలుస్తోంది అని, అందులో ఎక్కువ భాగం ఉన్నది ప్లాస్టిక్కే నని అన్నారు. అది ఎంతకీ భూమిలో కరగదన్నారు. సముద్రాల్లో చేపలు ఇతర జీవుల్ని అది చంపేస్తోంది. ఆ కాలుష్యపు నీటి నుంచి ఎటు వెళ్లాలో తెలియక ఆ మూగ జీవులు చనిపోతున్నాయి అని, ఇలా మహా సముద్రాలు సైతం ప్లాస్టిక్ కాలుష్యంతో సర్వనాశనం అవుతున్నాయి అన్నారు. నేడు ప్రపంచ మహా సముద్రాల దినోత్సవం కాబట్టి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు మనమంతా ఎవరికి వాళ్లం బలంగా నిర్ణయించుకుంటే చాలా వరకూ కాలుష్యాన్ని తగ్గించిన వాళ్లం అవుతాం అని, ఇది ప్రతి విద్యార్థి, ఎన్‌సిసి క్యాడెట్స్ ప్రజలకు అవగహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, యెన్.సి.సి లెఫ్టనెంట్ డాక్టర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

వైసిపి సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో గురువారం నాడు వైసిపి సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం వైసిపి యూత్ లీడర్ ముద్ద రామసుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి సోషల్ మీడియా కన్వీనర్లకు, కో-కన్వీనర్లకు అందుబాటులో ఉంటానని, ఎటువంటి ఇబ్బందులు వచ్చిన మీకు అండగా తోడు నిలబడతానని, ఏ సమస్యలు వచ్చిన నాకు తెలియపరిస్తే నేను సమస్యను పరిష్కరిస్తానని కన్వీనర్లకు భరోసా కల్పించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో అన్ని మండలాల కన్నా మండలం ప్రథమ స్థానంలో ఉందని, ఇంతటి ఘన చరిత్ర రావడానికి మీ అందరి కృషి ఎంతో ప్రముఖమైందని, ఇలాంటి కత్తితోనే పని చేసి కష్టపడి 2024 సంవత్సరంలో జగనన్నను మళ్లీ సిఎం చేసుకొని మన మండలంలో అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేయాలని తెలియజేశారు. మండలంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి నీటి సౌకర్యం ఉందని విద్యుత్ సౌకర్యం ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో మండల సోషల్ మీడియా కన్వీనర్ గద్దె వెంకటేష్, నియోజకవర్గ కో కన్వీనర్ పోలి మహేంద్రరెడ్డి, మండల కో-కన్వీనర్లు మైలు పూరి హరి, తోట శివకుమార్, వైయస్ మధు, బొమ్మ సుబ్రహ్మణ్యం, నాగ ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

రామసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న యువకులు

సైనిక్ స్కూల్లో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

భూగర్భ జలాలు పెంపొందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

భూగర్భ జలాలను పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఉపాధి హామీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని బుధవారం కేంద్రజలశక్తి అభియాన్ బృందానికి చెందిన నోడల్ ఆఫీసర్ ప్రకాష్ సూచించారు. జియో సైంటిస్టు ఏకే పవర్ మహల్ గ్రామంకు చెందిన ఎస్.శ్రీరాములు నిర్మించిన పారంపాండు, మామిడి మొక్కల పెంపకం పనులను, కలికిరి సైనిక్ స్కూల్‌లో బోర్వెల్ రీఛార్జి స్ట్రక్చర్, గ్రామీణ అటవీ ప్రాంత హైడెన్సిటీ మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. పనులను చేపట్టిన రైతులు, ఉపాధి హామీ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ మద్దిలేటి, కలికిరి ఎపిడి మధుబాల, ఎంపిడిఒ గంగయ్య, ఎపిఒ సుజాత, ఇసి, టిఎఎస్, ఎఫ్ఎఎస్‌లు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా అంజాద్ అలీఖాన్

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) ప్రధానోపాధ్యాయులుగా పి.అంజాద్ అలీఖాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న హెచ్ఎం శ్రీదేవి వాల్మీకిపురంలోని జడ్పీ హైస్కూల్ (ఉర్దూ)కు బదిలీ కాగా, బి.కొత్తకోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల (బాలుర) లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న అంజాద్ అలీఖాన్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గురువారం మధ్యాహ్నం పాఠశాలలో నూతన ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు వెంకటగోపాల్, జయశ్రీ నూతన హెచ్ఎంకు స్వాగతం పలికి, పాఠశాల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, పాఠశాల ప్రాముఖ్యతను కొనసాగించటానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రక్తదానంపై విద్యార్థులకు అవగాహన అవసరం

ప్రజాశక్తి-పీలేరు

రక్తదానంపై ఇప్పటికీ సమాజంలో కొన్ని అపోహాలు అనుమానాలు నెలకొని ఉన్నాయని వాటిని పారద్రోలేందుకు కృషి చేయాలని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. పీలేరు సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులు తమ తృతీయ ఏడాదిలోని కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుల భాగంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరో ముగ్గురి ప్రాణాలు కాపాడినవారమవుతామన్న సత్యం గ్రహించక ఇప్పటికే చాలామంది తమ రక్తం ఇవ్వడానికి వెనుకంజ వేస్తుండడం శోచనీయమన్నాడు. కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టులో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న విద్యార్థులు తమ అనుభవాలను తమ గ్రామాల్లోని సామాన్య ప్రజలతో పంచుకొని వారిని చైతన్యవంతుల్ని చేయాలన్నారు అనంతరం శిబిరంలో విద్యార్థులు అందించిన 40 యూనిట్ లను ఆయా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకుకు తరలించారు ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్ రెడ్డి ల్యాబ్ టెక్నీషియన్ మున్నాఫ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

సిఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

క్రైం కార్నర్

మహిళను వేధిస్తున్న యువకునిపై కేసు నమోదు

ప్రజాశక్తి- కలకడ

మహిళను వేధిస్తున్న యువకునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ముడియంవారిపల్లి కొత్తపల్లి హరిజనవాడ చెందిన జమ్మలమడుగు లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదుపై తన కుమార్తెను నవాబుపేట గ్రామానికి చెందిన మంద రాంప్రసాద్ అనే యువకుడు లక్ష్మీదేవి కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తూ ఫిర్యాది పెద్ద కుమార్తెకు బెదిరింపు మెసేజ్‌లు, అసభ్యకరమైన మాటలు మాట్లాడుతున్నాడని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి- కలకడ

మృతి చెందిన కళావతి

మండలంలోని బాట వారిపల్లి పంచాయతీ బాటవారిపల్లి సమీపంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. మండలంలోని బాట వారిపల్లి పంచాయతీ చలమ య్యగారిపల్లెకు చెందిన కళావతి (45), ఆమె భర్త శ్రీనివాసులు, కుమార్తె, మనవరాలు కలసి తమ టిడిఎస్ ఎక్సెల్ వాహనంలో పీలేరు నుండి కలకడకు వస్తున్నారు. ఈ క్రమంలో వెనుక వైపు వస్తున్న లారీ, వీరు ప్రయాణిస్తున్న టివిఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనంది. ఈ ప్రమాదంలో కళావతికి బలమైన రక్త గాయాలు అయ్యాయి. వెంటనే 108 వాహనంలో కళావతి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎస్ఐ తిప్పేస్వామి సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కళావతి భర్త శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టెంపో వాహనం ఢీకొని మరొకరు...

ప్రజాశక్తి-ములకలచెరువు

మృతి చెందిన కిషోర్

ద్విచక్రవాహనాన్ని టమాట లోడుతో వెళ్తున్న 407 వాహనం ఢీ కొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని దేవుల చెరువు పంచాయతీ యర్రంరెడ్డి గారిపల్లెకు చెందిన కిషోర్(45) ఆర్టిస్ట్ పెయింట్ పనులు చేసుకుంటూ భార్య, పిల్లలతో ములకలచెరువులో కాపురం ఉంటున్నాడు. తన ద్విచక్రవాహనంలో పనుల మీద సాయంత్రం యర్రంరెడ్డిగారిపల్లెకు వెళ్తుండగా స్థానిక గాలేటివారిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న 407 టెంపో వాహనం అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కిషోర్(45) తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఆదుపుతప్పిన వాహనం బోల్తా కొట్టడంతో టమోటా కిరిట్లతో జాతీయ రహదారిపై నేలపాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాన్ని పక్కకు జరిపి ట్రాఫిక్‌ను నియంత్రించారు. మృతుడికి భార్య శారద, కుమారులు సాయి గణేష్, సాయి బబ్లు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు చెప్పారు.